


# దేవుడి మనసు

శ్రీరంగం రాజేశ్వరరావు

ఉదయం ఐదు గంటలకే ప్రారంభిస్తుంది అనసూయ. "భగవంతుడా! ఎన్నాళ్లు తండ్రీ ఈ సుఖం లేని జీవితం? ఇంకెన్నాళ్ళిలా బతకమంటావు? ఎన్నాళ్ళీ జీవితంలో ఇంకా ఈ కార్చిచ్చులు? ఎన్నాళ్ళింకా ఈ నిట్టూర్పులు? సుఖంగా మరి యేం బతకవాఁ ఏమిటి? మేడలూ, మిద్దెలూ వద్దు... వజ్రాలూ, వైడూర్యాలూ వద్దు ... కార్లూ, రాకెట్లూ వద్దు... పచ్చనోట్లూ, పంఖాలూ వద్దు... ఎయిర్ కండిషన్లు, ఎమ్మెల్యే పదవులూ వద్దు... ఇవేవీ వద్దు... కాని కొంచెం సుఖం వద్దూ మరి? మిషిన్లలాగ బతకడమేనా? కొంచెం చిర్నవ్వులు, చల్లని సంతృప్తి ఇవి లేకపోతే ఎలాగ? మరి ఎందుకు బతుకుతున్నట్టు? నిన్ను నమ్ముకుని బతుకుతున్నాం. చచ్చేక స్వర్గానికి వెడతామని నమ్మకం లేదు. మరీ భూలోకంలోనైనా మా కొంచెం సుఖాన్నియ్యి తండ్రీ...! ఆయనా, నేనూ, రవీ, చంటిదీ సుఖంగా బతకాలి. అందులో ఆయన ... పీక పోయినా లంచం, అప్పు పుచ్చుకోని ఆయన వొట్టి అమాయకులు ... కనీసం ఆయనకైనా సుఖాన్నియ్యి తండ్రీ! మా వల్ల ఆయన ప్రాణానిక్కూడా సుఖం లేకుండా పోయింది. మమ్మల్ని కాపాడు పరాత్పరా!... జగద్రక్షకా కాపాడు..."

ఈ మాటలన్నీ ఆవిడ రోజూ ఉదయం ఐదు గంటలకి ప్రారంభించి, మధ్యలో కాస్సేపు పూరుకొని మళ్ళీ మొదలుపెట్టి రోజుకి కనీసం పాతికసార్లయినా అనుకుంటుంది. అందువల్ల ఆ మాటలు పైకి వినబడవు కాని, ఆవిడ మనసులో మాత్రం పెద్ద గొడవ చేస్తూంటాయి.

* * *

వూళ్ళో బియ్యం కరువైపోయి, (మొన్న మొన్ననే 'బ్లాక్' లో బియ్యం అమ్మినందుకు కొందరు వర్తకుల్ని పట్టు

కున్నారుట. అంచేత వాళ్లు 'ఎంత డబ్బిచ్చినా బ్లాక్‌లోకూడా ఇయ్యం' అంటున్నారుట.) ఇంట్లో డబ్బు కరువై పోయి, మహా ఐతే మరి ఎనిమిది రోజులకి మాత్రమే సరిపడే బియ్యం వరకే ఇంట్లో వున్నప్పుడు—ఓ రోజున, మొదటి సారి పైన చెప్పిన విధంగా అనుకుని, కాఫీ కలిపి, 'ఆయన' అనబడే సుదర్శనాన్ని లేపడానికి వెళ్ళింది అనసూయ. రెండు మూడు సార్లు పిలిచినా ఆయన లేవకపోతే, తట్టి లేపుదామని భుజంమీద చెయ్యివేసింది. వేసి వెంటనే తీసేసింది. భుజం చాలా వేడిగా వుంది. అప్పుడు అనుమానం వచ్చి నుదుటిమీద చెయ్యివేసి చూసింది. సుదర్శనం నుదురు అప్పుడే ఆవిడ దింపిన కాఫీగిన్నెలా కాలుతోంది. అనసూయ విపరీతంగా భయపడింది. అంతకుముందు రెండు మూడు రోజులూ రాత్రీ పగలూ పనిచేశాడు సుదర్శనం. అలా పనిచేసినందుకు ఆఫీసువాళ్లు ఎక్కువ డబ్బేమీ ఇయ్యరు కాని, అలా చెయ్యకపోతే మాత్రం వుద్యోగం తీసేస్తారుట! సరైన తిండీ, నిద్రా లేకపోతే మరేమి ఔతుంది? సుదర్శనానికి ఒక్కసారిగా విపరీతమైన జ్వరం వచ్చింది.

పక్కనే నిద్రపోతున్న పిల్లల్నిద్దర్నీ లేపకుండా సుదర్శనం మంచంపక్కనే కూర్చొని, ఒకచెయ్యి అతని నుదుటిమీద వేసి మరోచెయ్యి తన తలమీద వేసుకొని కాస్సేపు బాగా విచారించి, ఎందుకో మంచంమీదికి చూసింది అనసూయ. అక్కడ గోడమీద పదేళ్ళ క్రితం పి. యు. సి. చదివినవాళ్ళలో కొందరి గ్రూప్ ఫొటో వుంది. ఆ ఫొటోలో రెండో వరసలో ఏడో అమ్మాయి అందంగా కనపడుతోంది. ఆ అమ్మాయిపేరు అనసూయ...

*　　*　　*

"అనూ!" అని ఆవేళ అతి ముద్దుగా పిలిచింది వాళ్ళమ్మగారు. ఆ సమయానికి అనసూయ చేతిలో ఏదో నవల పట్టుకొని, ఆమెకన్న అందమైన కలల్ని కంటోంది.

అప్పుడు అనసూయకి పద్దెనిమిదేళ్ళున్నాయి. ఆ అమ్మాయికి ఆధునికమైన భావాలతోపాటు దేవుడిమీద చాలా భక్తి వుంది. హాయిగా డిన్నర్ తిని, స్కూటర్ వెనకాల కూర్చుని, స్కూటర్ నడుపుతున్న భర్త రెండు భుజాలమీదా రెండు చేతులూ వేసి, ఎగురుతున్న టెర్లిన్ పువ్వుల పైటవైపు ఎగిరెగిరి చూస్తున్న జనం వైపు చూసి గర్వపడాలని ఆమెకు లేకపోయినా, మధ్యతరగతికన్న మరొక మెట్టుపైని జీవితం వుంటే చాలని ఆమెకి వుంది. దేవుడి మనసు చాలా గొప్పదని ఆమె అభిప్రాయం. అందుకే మూఢనమ్మకాలూ, పాత ఆచారాలూ ఆమెకు లేకపోయినా, దేవుడి మీద చాలా నమ్మకం, భక్తీ వున్నాయి. అలాగే జీవితాన్ని వీలైనంత సుఖంగానూ, ఆనందంగానూ గడిపేయాలని అభిప్రాయం, గడిపేస్తే బావుణ్ణని ఆశా వున్నాయి.

అప్పుడు అనసూయ కలలనించి తేరుకుని, అమ్మ చెప్పినమాటలు విని ఏమనాలో తెలియక నిట్టూర్చింది. డిగ్రీ చదవాలని ఆమెకు ఏమంత కోరిక లేదు. అందుకే ఆ తరవాత నెల రోజులకి పెళ్ళి చూపుల్లో కూర్చుని, సిగ్గుతో బరువెక్కిన కనురెప్పల కొసలమీంచి 'సుదర్శనం' బి. ఏ. ని చూసి మనసుకి సంజాయిషీ చెప్పుకుని, అదే సిగ్గుల బరువుతో పెళ్ళి పీటల మీదా కూర్చుంది. అప్పటికి సుదర్శనం ఏమంత పేరులేని ప్రైవేటు కంపెనీలో పనిచేసేవాడు. ఇప్పుడు పెద్ద పేరున్న వో ప్రయివేటు కంపెనీలో వుద్యోగం చేస్తున్నాడు. అతనికి వుద్యోగం దొరికి ఏడాదయింది. ఇప్పుడతనికి రెండువందలు జీతమిచ్చే ఈ ప్రైవేటు కంపెనీ మరో గొప్ప దేశంవాళ్ళ ఆధ్వర్యంలో నడుస్తోంది. సుదర్శనం లాటి చలాకీ యువకులంటే వాళ్ళకిష్టం.

సుదర్శనం తన కొచ్చిన జీతం అనసూయ కిచ్చేస్తాడు. ఆవిడే కుటుంబాన్ని నడుపుతుంది. అంతేకాక అనసూయకి చాలా ప్రేమనిచ్చి, అంతే ప్రేమని తీసుంటాడతను. ఇప్పుడా ప్రేమ నింకా పెంచి అనసూయతో బాటు ఎనిమిదేళ్ళ రవికీ, ఏడాది రమణికీ పంచిపెడుతున్నాడు.

ఇలా కాలెండర్లు మారుతూండగానే, పరిస్థితులుకూడా బాగా మారిపోయేయి. వస్తువుల ధరలు పెరిగిపోయేయి. మధ్యతరగతివాళ్ళ కష్టాలు బాగా పెరిగిపోయేయి. పిల్లల కోసం ఖర్చులు పెరిగిపోయేయి. ఇలాగా సుఖం తప్ప, అన్నీ పెరిగిపోవడంవల్ల అనసూయ వెలుగు కలలో చీకట్లూ పెరిగిపోయేయి. ఐనా ఆవిడకి దేవుడిమీద నమ్మకంకూడా పెరుగుతూనే వచ్చింది. ఏరోజు నైనా జీవితంలో వెలుగుదీపాలు వెలుగుతాయని ఆవిడకి నమ్మకం వుంది.

*　　*　　*

సుదర్శనం కళ్ళు తెరిచేడు; లేవబోయి, లేవలేక మానేశాడు. "ఫోంచేసేవా?" అని నీరసంగా అడిగేడు అనసూయను.

అప్పటికి అతను రోజుకి రెండుసార్లు చొప్పున పదహారోసారి అడిగేడు. అతను జ్వరంతో బాధపడుతూ, బేడ రొట్టె, (ఇప్పుడది పావలా కాబోలు!), బార్లీ మాత్రం తీసుకుంటున్నాడు.

అనసూయ మాట్లాడలేదు. సుదర్శనం పక్క దీక్షగా చూసింది. అతని కళ్ళలో శోభ కనీసం ఆకాశం అంతైనావుండి వుంటుంది. అతని పెదవులమీద నవ్వు ఈపాటికి శక్తికందని మేరలకి పారిపోయి, మనసులోని డబ్బుల్లేవన్న ఆలోచన అతని మెదణ్ణిపాటికి మెగాటన్నులమధ్య పడవేసుంటుంది. మరొక్క రెండ్రోజులు పోతే, పిల్లలకి కూడా వంట చేయడం కష్టం అన్న సంగతి అతని హృదయాన్ని సవినయంగా చిత్రవధ చేస్తూండివుంటుంది. మరొక్క రెండ్రోజుల్లో వచ్చి జాయిన్

అవకపోతే ఉద్యోగం తీసెయ్యవలసి వుంటుందని మేనేజరుగారు పంపిన కబురు అతనికి తెలిసుంటే, ఈపాటి కతని మనసు మరేమై వుంటుందో ఆ దేవుడికే తెలియాలి. ఆ కబురు తెలిసిన అనసూయకి మాత్రం తిన్నగా ఆ మేనేజర్ గారి దగ్గరికెళ్ళి, "ఏవండీ! ఇదేం న్యాయం? కళ్ళెదురుగా ఆయన జ్వరంతో బాధపడుతున్నారు కదా! (కావలిస్తే వచ్చిచూడండి కూడా, డాక్టర్ని కూడా తీసుకురండి.) ... ఈ కరువు రోజుల్లో మేం ఎన్ని బాధలు పడుతున్నామో మీ కేమైనా తెలుసునా? అందులో నెలాఖరొకటి. ఎంత పైవేటు కంపెనీ ఐనా, ఎన్ని రూలైనా పది రోజులు సెలవు పెడితేనే వుద్యోగం తీసెయ్యాలా? మీకిదేమైనా బావుందా?" అని అడిగెయ్యాలని వుంది. కాని ఆ మేనేజరు, "ఎక్స్‌క్యూజ్ మీ మేడం! మాకూ బావులేదు, కాని, మా హయ్యర్ అథారటీస్ కిదే బావుంది ... మరో దేశం వాళ్లూ మరో దేశంవాళ్లూనా? అందులోనూ ఆయనకి ఏడాది మాత్రమే... వోన్లీ వన్నియ్యరే ... సర్వీసుంది ...! వాళ్ళ రూల్సు రూల్సేనండి; కావాలంటే ఎక్కడన్నా రాళ్ళు లేని బియ్యం అన్నా ఇప్పించగలను కాని, పది రోజులకి మించి సెలవూ, ఆ తర్వాత వుద్యోగం మాత్రం ఇప్పించలేను సుమండీ! క్షమించండి నన్ను," అంటాడని ఆవిడకి తెలుసు. ఆ కంపెనీ రూల్సు గురించీ, అధికారుల గురించీ ఆమె చాలా వింది.

"భోం చేసేవా?" అని మళ్ళీ, ఎనిమిది రోజులనించీ అన్నం తినని మనిషెలా అడగాలో అలాగే అడిగేడు సుదర్శనం.

ఆలోచనలు అంతం తెలీక, అతి ఘోరంగానూ, ఇరుకుగానూ మరిగిపోతూంటే; అతని కళ్ళ కింద కనిపిస్తున్న వాటి నల్లనిఛాయల్ని చూస్తూ "వూఁ" అంది అనసూయ.

ఆమె చెప్పింది నిజమో అబద్ధమో



సుదర్శనానికి తెలుసు. ఐనా మరేమీ మాట్లాడలేదు. "పిల్లలు..." అన్నాడు.

"రవి బడికెళ్ళేడు, చంటిది పాలు తాగి పడుక్కుంది," అంది అనసూయ. 'పాలు తాగి' అన్న పదం అతనికి కొంచెమైనా సంతృప్తి నిస్తుందని ఆవిడ చాలా ఆశ పడింది.

సుదర్శనం సరిగ్గా వినలేదు. వాళ్ళ కంపెనీ రూల్సునీ, అనసూయనీ, రవినీ, రమణినీ కరువునీ - ఒకే ఆలోచనల ఫ్రేములో బిగించి, పెరిగిపోతున్న నిరాశని ఆ ఫ్రేముకి అద్దంలా బిగించి, మనసుతో చూస్తూ, అతను, భవిష్యత్తు వేసుకొనే రంగుల్ని మేగ్నిఫై చేసుకుంటున్నాడు.

అతనికి బార్లీ కలపడానికి లేచి వంటింట్లోకి నడిచింది అనసూయ. బార్లీగింజలు ఒకటో రెండో గుప్పిళ్ళుంటాయి. అవి 'మరో రెండ్రోజులే' అని చెపుతున్నాయి. బార్లీ మరిగించి, గ్లాసులో పోసి, తీసుకురాబోతున్న అనసూయ గుమ్మందగ్గిర తూలి పడబోయింది. సుదర్శనానికి ఒక్కటిండే కాని. ఆవిడకి మరి ఎనిమిదిరోజులనించీ సరైన తిండీ నిద్రాకూడా లేవు మరి! అదృష్టవశాత్తూ బార్లీ వొలికిపోకుండా చూసి, బార్లీ సుదర్శనం చేత తాగించి, కాస్సేపయేక మందిచ్చి (డాక్టరుగారు పక్కింట్లోనె వుంటున్నారు. మంచాయన పాపం!) పిల్లలకీ, తప్పదుకనుక తనకీ ఇన్ని బియ్యం పడేడానికి మళ్ళీ వంటిట్లోకి నడిచిందావిడ. బియ్యండబ్బాలో వున్న బియ్యం కూడా రెండంకెని ఆమె ఆలోచనల్లోకి విసిరేయి. (అప్పటికే ఆవిడ రెండు మూడ్రోజులనించీ సరిగ్గా తినడమేలేదు.)

అనసూయ నిట్టూరుస్తూ కళ్ళు మూసుకుంది.

* * *

"భోంచేశావా?" అని పూటకోకసారిచొప్పున పద్దెందోసారి అడిగేడు సుదర్శనం. అతని కింకా జ్వరం పూర్తిగా తగ్గలేదు. ఎంత కష్టపడ్డా, అతను ధైర్యాన్నిమాత్రం మనసులోకి ఇంజక్ట్ చేసికో లేకపోతున్నాడు. అందువల్లనే అతని కంఠంకూడా లీలగా వొణికింది.

"ఊఁ!" అంది అనసూయ. అలా అంటున్నప్పుడు ఆమె కంఠం గద్గదంగానే వుంది. కళ్ళంట నీళ్లొచ్చినట్టుగా ఆమెకు అనిపించింది. కాని కన్నీళ్ళు రాలేదు. కొన్నిరాత్రుల్ల విడుపులేని అనుభవంలో అవి విసుగెత్తిపోయాయి.

సుదర్శనం కళ్ళు మూసుకున్నాడు.

ఆక్షణంలో, "విటమిన్లు తినకపోతే ఇలా ఐపోతారు చూడండి," అని సుదర్శనాన్ని ఎగ్జిభిషన్‌లో జనానికి చూపిస్తే, వాళ్లు ఆశ్చర్యపోడానికి సంశయించి, మరుక్షణం లోనే విటమిన్లు తినడం ప్రారంభించేస్తారు.

అతని ఆలోచనా ఎడారిలో ఆశలనీటి చుక్క ఎంత వెతికినా దొరకడం లేదని అతను చాలా కంగారుపడుతున్నాడు. అనసూయ లేచి వంటింట్లోకి నడిచింది. రవి వంటింట్లోనే కూర్చుని ఏదో రాసుకుంటున్నాడు. అమ్మను చూసి, మళ్ళీ తల దించుకు రాసుకోడం మొదలుపెట్టేడు.

అనసూయ దేవుడి విగ్రహందగ్గిరకు వెళ్ళి మనసును విగ్రహపు పాదాలముందు పడేసింది. ఆ మనసును విప్పటానికి భయపడ్డ దేవుడు కదలకుండా అలాగే వుండిపోయాడు.

"ఎందుకమ్మా! ఇన్నాళ్ళనించీ ఎప్పుడు చూసినా దండం పెడుతూనే వున్నావు దేవుడికి. నాన్నకి జ్వరం తగ్గనూలేదు, నువ్వు దండాలు పెట్టడం మాననూలేదు. మందు లెన్ని వాడినా, దండా లెన్ని పెట్టినా ఇంకా జ్వరవేవిటి ?" అన్నాడు రవి.

"తప్పు రవీ! దేవుడిమనసు చాలా గొప్పది నాన్నా! ఆయన దయుంటే..." అంది అనసూయ.

ఆయన దయవుంటే ఏమిటి జరుగుతుందో చెప్పబోయేముందు ఆమె కో ఆలోచన వచ్చింది. దేవుడికి దీపం పెట్టి చాలా రోజులైంది. అందువల్ల వొత్తుల కోసం టేబిల్ మీదున్న పెట్టె తీసింది.

అప్పు డామె కళ్ళలో తెల్లని జ్యోతి వెలిగింది. దేవుడి పాదాలముందు పడి నిద్రపోతున్న మనసు వొక్కసారిగా లేచి వచ్చి దేవుడికి మనస్ఫూర్తిగా నమస్కరించింది.

ఆ వొత్తుల పెట్టెలోన ఒక చక్కని తెల్లని అర్ధరూపాయి కాసుంది. "ఏం చేయడం దాంతో? ... మరో రెండు రొట్టెలు తెప్పించడమా? ఎల్లుండికి బియ్యం తీసుకోడమా? లేపోతే..." అనసూయ మనసులో అనుకోని మెరుపు మెరిసింది. ఆమె కా ఆలోచన వచ్చినందుకు చాలా సంతోషించింది. దేవుడికి లెక్కలేనన్ని దండాలు పెట్టుకుని మనసులో పట్టినంత ఆనందాన్నినింపేసుకుని చాలా హాయిగానూ రవిని పిలిచింది అనసూయ.

"చూడొరే నాన్నా! ఇంద! ఈ అర్ధరూపాయి తీస్కెళ్ళి, వెంకటరమణమూర్తి గుడికి వెళ్ళి వో కొబ్బరికాయ కొట్టేసి రా! భోంచేసే వెళ్ళు. మరి దేవుడు చాలా మంచివాడు కదూ! అంచేత నాన్నారు రేప్పొద్దునే లేచి, హాయిగా నవ్వి, ఆఫీసుకి వెళ్లిపోతారు. మంచాడివికదూ! గబగబా భోంచేసి వెళ్ళు నాన్నా!" అని ఆవిడ రవితో చెప్పింది. వేగంగా వండేసి రవికి వడ్డించింది.

రవి మరేమీ మాట్లాడకుండా భోజనం చేసి, చొక్కా వేసికొని, సముద్రపొడ్డు కొసనున్న దేవుడిగుడికి, సముద్రపొడ్డుదాకా పరిగెత్తి, ఆ తరవాత చల్లగాలిలో మెల్లిగా నడవడం మొదలెట్టేడు.

రవి వెళ్ళేక, అనసూయ చాలా ధైర్యంగానూ, ఆశగానూ వెళ్ళి దేవుడి విగ్రహం ముందు నిలబడి, దండం పెట్టి, "భగవంతుడా! రేపాయన వుద్యోగానికి వెళ్లకపోతే, ఎల్లుండినించీ మా రోజులుకూడా వెళ్ళవ్. నీమీద మే మెంతాశ పెట్టుకున్నామో, నే నెన్ని దండాలు పెట్టుకున్నానో, నాకు తెలీకపోయినా నీకు తెలుసుకదా! అందుచేత మమ్మల్ని చల్లగా చూడు తండ్రీ! రక్షించు. ఆ అర్ధరూపాయి కాసు నువ్వు చూపించిన వెలుగుకాక మరేమిటి? అంచేత నువ్వు మమ్మల్ని తప్పకుండా రక్షిస్తావని నమ్మకం వుంది. కాని నమ్మకం వొక్కటే చాలదు కదా? అంచేత మనసంతా నీ ముందే పరిచేస్తున్నాను. పరిచిన ఈ మనసుని కాళ్ళతో తొక్కేస్తావో, నీ మెళ్ళోని పువ్వులదండలోని ఒక పువ్వుని తీసి పడేస్తావో నీయిష్టం కాని, నా ఇష్టం కాదుకదా! ఐనా మనస్ఫూర్తిగా నమస్కరిస్తున్నాను. మేం నిన్నే నమ్మేం. మమ్మల్ని రక్షించు నాయనా! జగద్రక్షకా కాపాడు!" అని ఆవిడ ప్రార్థించి, ఆశని మనసులో వెలిగించుకుని, ఆ తరవాత బార్లీ కలపడానికి స్టౌ వెలిగించింది.

చాలా సంతృప్తి కలగడంవల్ల ఆవిడ హృదయం చాలా తేలిగ్గా వుంది.

* * *


రవికి పెద్దసమస్యే వచ్చింది. ఇప్పు డేం చెయ్యడమో అతని కర్థమవడం లేదు.

ఆవేళ పొద్దున్నే క్లాసులో నానిగాడు, అప్పు డెప్పుడో తీసుకున్న పదిపైసలూ అప్పు తీర్చేశాడు. ఇప్పటిదాకా ఆ పదిపైసలూ జాగ్రత్తగా దాచేడు రవి. అమ్మకి చెపుదా మనుకున్నాడు కాని అస లమ్మని చూస్తే మాట్లాడ్డానికే భయం వేసింది. 'ఎవ రిచ్చేరు?' అని కోప్పడుతుంది. అప్పు తీర్చేశాడు నానిగాడు అని చెప్పినా, 'వెధవా! వేలె ళ్ళేవు, నీ కప్పులేమిట్రా?' అని గట్టిగా కొట్టేసినా కొట్టేస్తుంది. ఆ తర్వాత తనేడుస్తూంటే అమ్మకూడా మళ్ళీ ఏడుస్తుంది.

ఇదంతా ఎందుకని, ఏదో మంచి ఖర్చు పెట్టాలని రవి అనుకున్నాడు. అంచేత ఏం చేయడమోనని అతను చాలా సేపటి నించీ ఆలోచిస్తున్నాడు. ఎందుకో కాని ఈ పది పైసలూ తన స్వంతార్జన కనక చాలా మంచిపని చేయాలని అత ననుకున్నాడు.

చాకలేట్టు కొని చెల్లి కిద్దామంటే, అది మరీ చిన్నపిల్ల కదా! తినలేదు. అది పెద్దయ్యేదాకా ఈ పదిపైసలూ ఉండవు. తనమట్టుకి తనకి ఏమీ కొనుక్కోవాలని లేదు. నాన్నకి మందులావు...అమ్మకి చీరలూ రావు...ఏం చేయడం...?

బీచిగాలి, చల్లగా, మొదటిసారి క్లాసులో ఫస్టుమార్కొచ్చినప్పుడు అమ్మ పెట్టుకున్న ముద్దంత చల్లగా వుంది. చీకట్లో




దూరంగా మెరుస్తున్న సముద్రం, మొన్న అమ్మ తలంటుకొని దువ్వుకోకుండా వదిలేసిన జుట్టులా వుంది. కాస్త దూరంలో దేవాలయాన్ని చుట్టుముట్టిన బల్బులు మేష్టారు మెచ్చుకున్నారని చెప్పినప్పుడు, అమ్మ కళ్ళలో వెలిగిన దీపాల్లాగున్నాయి.

రవి అమ్మ గురించి ఆలోచించేడు. అమ్మ ఈమధ్య రెండు మూడుసార్లు పడవడం తను చూశాడు. నాన్న జ్వరం తగ్గదనేగా? పోన్లే...ఇప్పుడు తను వెళ్లి దేవుడికి కొబ్బరికాయ కొట్టేస్తే తగ్గిపోతుందిగా...!

రవి వేగం నడవడం మొదలుపెట్టేడు... దార్లో ఎవరో రోడ్డుమీద పడున్నారు. "చినబాబూ!" రవి దగ్గరగా రాగానే పిలిచేరు. రవి దగ్గరగా వెళ్ళేడు. ఎవరో ముష్టివాడు – అసలు పుట్టిన దగ్గర్నించీ అన్నంముఖం చూడనివాళ్ళా వున్నాడు. వొంటిమీద ఓ గోచీ, ముందు నో డబ్బా తప్ప మరేం లేవు. కళ్ళలో చావుకోసం ఎదురుచూస్తున్న భావంతప్ప మరేంలేదు. గాలికి అతను కొంచెం వొణుకుతున్నాడు. మ్యునిసిపల్ దీపానికి కూడా అతనంటే లోకువే కాబోలు – పక్కనే వున్నా వెలగడం మానేసింది. "బాబూ!" అని మళ్ళీ జాలిగా పిల్చే డతను. తన అసహాయతనీ, తన దారిద్ర్యాన్నీ, తన కష్టాల్నీ ఏకరువు పెట్టడానికి భావం, భాషా వున్నా, వోపిక లేక అతను మాట్లాడలేకపోతున్నాడు.

రవి మనసంతా జాలితో నిండిపోయింది. సముద్రపు కెరటాలకి తట్టుకోలేకపోయిన బలహీనపు బీచిగట్టులాగ, అతని లేతమనసు జాలి కెరటాలను తట్టుకోలేకపోయింది. గుండెల్లోంచి వొలికిపోయిన జాలి అన్ని నరాల్లోకీ పాకిపోయింది. ఆ తరవాత అమ్మ చెప్పిన నీతికథలూ, అతను విన్న జాలికథలూ, అన్నీ జ్ఞాపకమొచ్చేయి. అతనికి తెలీకుండా అతనినే లేత మనసులో వొక్కసారిగా వెయ్యి

వెలుగుల చెట్టు మొలిచి పెరిగి, మానవత్వపు పువ్వుల్ని పూతగా పూసింది.

రవి మనసులో చక్కని ఆలోచన దేవుడిగుళ్ళోని బల్బుల వెలుగంత వెలుగుతో మెరిసింది.

అప్పు డత నను కోకుండా తన జేబులోంచి పదిపైసల కాసు వేయగానే వినబడ్డ శబ్దం, దేవుడి గుళ్ళో ఓసారి అమ్మ తన నెత్తుకుని తన చేత్తోనే వాయించిన గంటల గణగణంత బావుంది. ఆ తరవాత ఆ మసగచీకట్లో అతని కళ్ళలో వెలిగిన వెలుగు, శివరాత్రినాడు (ఓసారి అమ్మతో వచ్చే డతను) గుడిలోపల వెలిగించిన ట్యూబ్ లైట్ల వెలుగంత అందంగా వుంది.

రవి చాలా సంతృప్తిగా గుడివేపు జోరుగా నడిచేడు. అతనికి చాలా సంతృప్తిగానూ, సంతోషంగానూ వుంది. చాలా గొప్పపని చేసినట్టు అతను ఫీలయ్యేడు. తన స్వంతడబ్బు ఇంత మంచిపనికి వుపయోగపడ్డందుకు చాలా సంతోషించాడతను.

ఆ తరవాత కొద్దిసేపట్లోనే కొబ్బరికాయల కొట్టుదగ్గరకి వెళ్ళి, అర్థరూపాయి కొబ్బరికాయవైపు చూసి, అందులో అమ్మనీ, నాన్ననీ, దేవుణ్ణీ వొకే ఫ్రేములో వూహించుకుని జేబులోంచి అమ్మ ఇచ్చిన అర్థరూపాయికాసు తీసేడు రవి.

దాన్ని వెలుగులో చూసి, అతను చాలా పెద్ద 'షాక్' తిన్నాడు. అది అమ్మ ఇచ్చిన అర్థరూపాయి కాదు. నానిగాడిచ్చిన పదిపైసలు. అంటే ఇందాక ఆ ముష్టివాడికి తను పదిపైస లనుకొని అర్థరూపాయి ... అమ్మయ్యో! ఇంకేమైనా వుందా? అమ్మకీ దేవుడికీ ఇద్దరికీ కోపం వస్తుందేమో? ఏంచేయడం మరి? ఈ పది పైసలకి కొబ్బరికాయ పీచుకూడా ఇవ్వడు. ఏంచేయడం మరి? ఇందాక తనెంత పొరబాటు చేశాడు? ఎలా గివ్వుడు? ఎలాగ? ఏం చేయడమో తెలీటంలేదు. పోనీ ఈ పదిపైసలతో అరటిపళ్ళు కొని దేవుడికిస్తేనో? ఉహుఁ! లాభంలేదు. అరటిపళ్లు కొబ్బరికాయలు కావుకదా? మరెలాగ?

ఆతరవాత అతని మనసులో చక్కని వెలుగొకటి వెలిగింది. వెంటనే అతను జోరుగా నడిచి ఇందాకటి ముష్టివాడి దగ్గరికి వెళ్ళేడు. అతని ముందున్న డొక్కులో అర్థరూపాయి కాసు, కాలెండర్లో దేవుడి చిరునవ్వులాగ మాయమవకుండా మెరుస్తోంది. ఈ పదిపైసలూ అందులో పడేసి ఆ అర్థరూపాయి తీసుకుంటే? రవి డొక్కుదగ్గిరికి నడిచి, కాస్త వంగేడు. ఆతరవాత ఆ ముష్టివాడి కళ్ళలోకి చూసేడు. ఆ కళ్ళలోంచి ఏ మానవత్వపు వెలుగులు అతని మనసులోకి ప్రసరించి కమ్ముకున్నాయో కాని రవి గభాలున తన జేబులోంచి పదిపైసలు తీసి, అదే డొక్కులో పడేసి, గంటల గణగణలాటి మధురమైన శబ్దం-వెనక్కి తిరిగాడు. రవి తెల్లని నుదురుమీద చిరుచెమటలు పట్టి, దేవుడి మెడలో హారంలోని ముత్యాల్లా మెరిశాయి.

తిరిగి దేవాలయానికి వెళ్ళి, అతను మెట్లెక్కకుండానే దేవుడికి మనస్ఫూర్తిగా దండం పెట్టుకుని, "దేవుడూ! నన్ను క్షమించు! ఈ ఒక్కసారే! నాన్నార్ని రేపు ఆఫీసుకి పంపించి! ఈమాటు తప్పకుండా కొబ్బరికాయ కొడతాను. రక్షించు తండ్రీ!" అని చాలా దీనంగా ప్రార్థించి మెల్లిగా అడుగులు వేస్తూ ఇంటికి నడిచేడతను. అప్పుడు సముద్రం మీదనించి వచ్చిన చల్లగాలి అతనికి తగిలి, చాలా హాయి నిచ్చింది.

అమ్మనీ, నాన్ననీ, తననీ దేవుణ్ణీ ఎన్నో రంగుల్లో వూహించుకుంటూ అతను ఇంటి కెళ్ళేసరికి వీధి తలుపు తీసేవుంది. లోపల నాన్న మంచంమీద తల పెట్టుకుని అమ్మ నిద్రపోతోంది. అమ్మని లేపకుండా రవి నిశ్శబ్దంగా తన పక్కమీదికి వెళ్ళి పడుక్కుని కళ్లు మూసుకున్నాడు. దేవుడిని చాలా సేపు ప్రార్థించి, చాలా దండాలు పెట్టుకున్నాక అతనికి చక్కని, చల్లని నిద్ర పట్టేసింది,

* * *

"రవీ! రవీ! లే నాన్నా! ఏడున్నరవుతోందిరా! లే మరి." చల్లని చెయ్యి బుగ్గమీద పడ్డంతో రవి కళ్ళు తెరిచేడు. ఎదురుగా అమ్మ కూర్చొనివుంది. అమ్మ కళ్ళలో వెలుగూ, అమ్మ మొఖంమీద చిర్నవ్వూ కనిపించేయి. అమ్మ చాలా రోజులకి అంత హాయిగా నవ్వుతోంది. రవి మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు. నిన్నటి విషయంఅంతా జ్ఞాపక మొచ్చింది.

"లేరా మరి! నీకో మంచి కబురు చెప్పనా మరి? నాన్నారు పొద్దున్నే లేచి స్నానం చేసి, హాయిగా నవ్వి ఆఫీసుకి వెళ్ళిపోయారు. సాయంత్రం నీకు చాకలేట్లు తెస్తారు. చూశావా మరి? దేవు డెంత మంచివాడో? దేవుడిమన సెంత గొప్పదో మరి చూశావా? నీకు ఈ సంవత్సరం కూడా ఫస్టుమార్కే-లే...! లే నాన్నా మరీ!" అంది అనసూయ.

రవికి చాలా ఆనందం, ఆశ్చర్యం కలిగేయి. ఏదో చెబుదామని కళ్ళు తెరిచేడు, కాని అమ్మ కళ్ళలో వెలుగు చూస్తూంటే అన్నీ మరిచిపోయి, ఒక్కసారిగా లేచి, అమ్మని కౌగలించుకున్నాడు.

అతని బుగ్గమీద అమ్మ పెట్టుకున్న ముద్దు, హాయిగా, చల్లగా వుంది. ✱